సాక్షి
మంచిర్యాల

శనివారం । 8 । మార్చి । 2025



బస్టాప్‌ల్లో ఇబ్బందే..!


- ఇళ్లలో స్వేచ్ఛ లభిస్తోంది..
- బయట అనుమానపు చూపులు
- తెలియని వారితోనే సమస్యలు
- మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' సర్వే

వివక్ష లేదు



ఆడ, మగ అనే వివక్ష ఇంట్లో, బయట లేదు. కానీ బయటకు వెళ్లినప్పుడు మాత్రం బస్టాప్ వంటి ప్రాంతాల్లోనే యువతులు, మహిళలు కొంత ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. పనిప్రదేశంలో గానీ, ఇంట్లో గానీ ఆడ, మగ సమానమనే విధంగానే ఉంటోంది. తెలిసిన వారి కంటే తెలియని వారి వల్లనే మహిళలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. – విజయ, లెక్చరర్, మంచిర్యాల





మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/చెన్నూర్/నిర్మల్/వాంకిడి/ఆసిఫాబాద్‌రూరల్/బోథ్: మహిళలు, యువతులు, విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. పురుషులకు దీటుగా పనులు చేస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. కానీ సమాజంలో అక్కడక్కడ మహిళలపై చిన్నచూపు ఉండడం వల్ల అనేక అవకాశాలకు దూరమవుతున్నారు. పని ప్రదేశాల్లో వేధింపులు, ఆధిపత్య ధోరణులు మహిళలకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఎక్కడ.. ఎవరితో వివక్షకు గురవుతున్నారనే అంశాలపై 'సాక్షి' మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యార్థినులు, యువతులు, మహిళలు 350మంది నుంచి సర్వే ద్వారా వివరాలు సేకరించింది. తెలియని వారు, ఆకతాయిలతో ఇక్కట్లు పడుతున్నట్లు తేల్చిచెప్పారు. బస్టాప్‌ల్లో అత్యధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ఇళ్లలో ఆడ, మగ అనే వివక్ష లేదని, అభిప్రాయాలకు గౌరవం లభిస్తోందని స్పష్టమైంది.

నల్లనేలలో నారీ శక్తి



ఎస్సార్పీ ఓసీపీలో భారీ యంత్రం మరమ్మతు



ఆర్కే 7 భూగర్భగనిలో కార్మికులకు సూచనలిస్తున్న మహిళా అధికారులు

- బొగ్గు ఉత్పత్తిలోనూ మహిళల శ్రమ
- పురుషులకు సమంగా అతివలు
- భూగర్భంలోకి దిగుతున్న ధైనం
- సింగరేణిలో పెరుగుతున్న ప్రాధాన్యత

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/శ్రీరాంపూర్: బొగ్గు గని అంటే చీకటి గుహ. మగవాళ్లకే పరిమితమైన విధులను మహిళలు సైతం చేసి చూపిస్తామని నిరూపిస్తున్నారు. 'మీ రేం పని చేస్తారు' అన్న ఎగతాళీ నోళ్లకు ముకుతాడు వేస్తూ మహిళలు తలచుకుంటే ఏ పనైనా చేయగలమని నిరూపించారు. కంపెనీలో కారుణ్య ఉద్యోగాల కారణంగా మహిళల సంఖ్య 1995 మందికి చేరింది. గత కొంతకాలంగా భూగర్భంలోనూ పని చేస్తున్నారు. కంపెనీలో పని చేస్తున్న మహిళలపై కథనం..

పోరాడి సాధించాం..



బీటెక్‌లో మైనింగ్ కోర్సు అంటే అందరూ భయపెట్టినా పట్టించుకోలేదు. 2017లో కంపెనీ ఎంజీఈటీ నోటిఫికేషన్‌లో మొదట మెన్ అనే నిబంధన ఉంది. మైనింగ్ కోర్సుకు అవకాశం ఇచ్చి ఉద్యోగానికి వచ్చే సరికి ఎందుకు పనికి రామని ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శికి లేఖ రాశాం. ఎమ్మెల్యేలను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం. మా పోరాటం ఫలితంగా గత సంవత్సరం జేఎంఈటీ, ఎంజీటీ పోస్టుల్లో ఉమెన్‌కు అవకాశం కల్పిస్తే ఉద్యోగం సాధించాను. అందరూ సహకరిస్తున్నారు.
– పీ.లక్ష్మి, ఎంజీటీ(అండర్ మేనేజర్) ఆర్కే 7 గని, శ్రీరాంపూర్

సింగరేణిలో మహిళా ఉద్యోగులు

ఏరియా	అధికారులు	కార్మికులు
బెల్లంపల్లి	08	116
మందమర్రి	17	254
శ్రీరాంపూర్	13	251
కార్పొరేట్ ఆఫీసు	62	279
ఎస్టీపీపీ జైపూర్	03	11



కోర్టు తీర్పుతో హక్కులు..

బ్రిటీష్ కాలంలో పురుషులతోపాటు సమానంగా మహిళలు గనుల్లో పని చేసేవారు. ప్రమాదాలు నిత్యకృత్యంగా జరిగినా, తిండి లేక చావడం కంటే పిడికెడు మెతుకుల కోసం పనులకు వచ్చేవారు. ఎక్కువగా వితంతువులే ఈ పనులకు వెళ్లేవారు. దేశ స్వాతంత్ర్యం వచ్చాక మహిళలను గనుల్లో తీసుకోవడం నిలిపివేశారు. ప్రమాదవశాత్తు గనుల్లో కార్మికులు చనిపోతే వారి స్థానంలో భార్యలకు ఉద్యోగం కల్పించే వారు. అది కూడా ఉపరితలంలోనే గుట్కాల షెడ్లులు, కార్యాలయాల్లో అటెండర్లుగా నియమించారు. మహిళలకు కూడా అవకాశాలు కల్పించాలనే ఓ వ్యాజ్యంపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో మహిళలకు అవకాశాలు మెరుగయ్యాయి.

అన్ని స్థాయిల్లో విధులు

కారుణ్య కోటాలో మొదట జనరల్ మజ్దూర్(ఫిమేల్)గా నియమిస్తూ ఆఫీసులు, సివిల్ డిపార్టుమెంట్లలో తేలిక పాటి పనులకు తీసుకునే వారు. వీరి సంఖ్య పెరగడంతో ఓసీపీలు, వర్క్‌షాప్‌లు, స్టోర్స్, సీహెచ్‌పీలతోపాటు భూగర్భ గనుల్లో కూడా దిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఓసీపీల్లో హెమ్ సెక్షన్‌లో పురుషులతోపాటు వీరు సమానంగా యంత్రాలను మరమ్మతు చేస్తున్నారు. సీనియర్ మహిళా కార్మికులు సెక్యూరిటీ గార్డులుగా ఉన్నారు. జనరల్ మజ్దూర్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ, సబ్ ఓవర్‌సీస్ ట్రైనీ, స్టాఫ్‌నర్స్, క్లే పిల్ మజ్దూర్, స్వీపర్ బదిలీ వర్కర్లతోపాటు ఎగ్జిక్యూటివ్ స్థాయిలో అండర్ మేనేజర్లు, లా ఆఫీసర్స్ వంటి 27హోదాల్లో పని చేస్తున్నారు.

భూగర్భంలోనూ విధులు

ప్రస్తుతం వీలున్న చోట్ల భూగర్భ గనుల్లో మహిళలు పని చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్కే 7, ఎస్సార్పీ 3 గనుల్లో ఎలక్ట్రీషియన్లు, ఫోర్‌మెన్, జేఎంఈటీ, ఎంజీటీ(మైన్ అండర్ మేనేజర్)లు ఉద్యోగ పరీక్షలు రాసి ఎంపికయ్యారు. మైనింగ్ అధికారులుగా మహిళలు ఆరంగేట్రం చేయడంతో కంపెనీలో కొత్తదనం సంతరించుకుంది. ఎంజీటీగా రెండేళ్ల తర్వాత అండర్ మేనేజర్‌గా, ఓసీపీల్లో ఈపీ ఆపరేటర్లుగా అవకాశం కల్పిస్తున్నారు.

ఎలక్ట్రికల్ పనులన్నీ చేస్తా



నాలుగేళ్ల నుంచి ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో పని చేస్తున్నాను. మోటార్ వైడింగ్ మొదలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యాన్లు, లైట్లు అన్ని రిపేర్ చేయగలను. ముందుగా ఎలా చేయాలో వీటీసీలో శిక్షణ ఇచ్చారు. అధికారులు, తోటి ఉద్యోగుల ప్రోత్సాహం బాగుంది.
– కే.సంధ్య, జనరల్ మజ్దూర్, ఏరియా వర్క్‌షాప్

భయపడితే ముందుకెళ్లం



ఓసీపీలో భారీ యంత్రాల మధ్య పని చేస్తామా అన్న సంకోచం ఉండేది. ఏమైనా సరేనని వచ్చా. ఇప్పుడు ఏ ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నాం. ఎంత పెద్ద యంత్రమైన టెక్నీషియన్‌తో కలిసి రిపేర్ చేస్తున్నాం. అన్ని రకాల వసతులు ఉన్నాయి. మహిళలకు ఇబ్బందికర పరిస్థితులేవీ లేవు.
– ఎం.శైలజ, జనరల్ మజ్దూర్, ఎస్సార్పీ ఓసీపీ

ప్రోత్సహిస్తే రాణిస్తారు



సమానత్వం చూపెట్టి ప్రోత్సహిస్తే మహిళలు పురుషులకంటే మిన్నగా రాణిస్తారు. ఏ పని అప్పగించిన నిజాయతీగా, అంకితభావంతో పని చేస్తారు. మహిళా ఉద్యోగులు పురుషులతో సమానంగా పని చేస్తున్నారు. కంపెనీ వారి కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. ఆరు నెలలు మెటర్నిటీ, పిల్లలకు 18ఏళ్లు వచ్చే లోపు 2ఏళ్ల చైల్డ్ కేర్ లీవులు ఉన్నాయి. ఎవరైనా వేధింపులకు గురైతే ఏరియా ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. మహిళల సంరక్షణకు కంపెనీ అన్ని చర్యలు తీసుకుంటోంది. – ఎస్.శిరీషారెడ్డి, డీజీఎం(లాఆఫీసర్), శ్రీరాంపూర్

తోడు లేకున్నా.. నీడైంది..!

- ఆ అమ్మకు నీరాజనం
- ఏడుగురు కూతుళ్లు, కుమారుడు
- భర్త లేకున్నా అందరినీ సాకిన ఆదర్శమూర్తి
- కూలీ పని చేస్తూ పిల్లలకు ఉన్నత చదువులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే8 కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొంకటి అనసూర్య ఆయాగా పని చేస్తోంది. ఆర్కే8 కాలనీలోనే నివాసం ఉంటోంది. ఆర్కే 6 గనిలో కోల్‌కట్టర్‌గా పని చేస్తూ భర్త వెంకటయ్య 30ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. వీరికి ఎనిమిది మంది సంతానం. కూతుళ్లు సంతోష, విజయ, స్వరూప, మాధవి, సంధ్య, రమా, స్వాతి, కుమారుడు రఘు ఉన్నారు. పిల్లలందరినీ ఐదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చదివించింది. ఆ తర్వాత ప్రభుత్వ హాస్టళ్లలో ఎక్కడ సీటు వస్తే అక్కడ చేర్పించింది. 'చదువు లేకుంటే కైకిలు పనికి పోవాల్సి వస్తుంది బిడ్డ..' అని మంచి మాటలు చెబుతూ వారి ధ్యాసను చదువువైపు మళ్లించింది. భర్త ఉన్నప్పుడే పెద్ద కూతురు సంతోషకు పెళ్లి చేసింది. రెండో కూతురు విజయను పీజీ(ఎంఏ) వరకు చదివించగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. స్వరూపను పీజీ(ఎంఏ), మాధవి కూడా పీజీ(ఎంఎస్సీ, బీఈడీ) వరకు చదివించి పెళ్లి చేసింది. సంధ్య బీఎస్సీ నర్సింగ్ చేసి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా, రమ్య బీఎస్సీ నర్సింగ్ చేసి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో నర్సుగా చేస్తున్నారు. స్వాతి ఎంకాం, బీఈడీ చదివి ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా చేస్తూ గ్రూప్స్‌కు సిద్ధమవుతోంది. వీరందరికీ అనసూర్య పెళ్లి చేసింది. కుమారుడు రఘును సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చదివించగా ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు.

ఉన్న దాంట్లో పిల్లలను పెంచిన కూడా చదువులు, పెళ్లిళ్లకు అనసూర్యకు సుమా రు రూ.10 లక్షల వరకు అప్పు అయ్యింది.

ఎదిగిన పిల్లలు ఆసరాగా..

ఆడపిల్లలైనా చదువుకు లోటు రాకుండా చేసింది. తల్లి కష్టాన్ని చూసి కూతుళ్లు మిగతా చెల్లెళ్ల పెళ్లిళ్లకు చేతనైన సహాయాన్ని అందిస్తూ వచ్చారు. ఈ నెల 2న జరిగిన చివరి కూతురు పెళ్లి సమయానికి అక్కాచెల్లెళ్లు అంతా కలిసి తల్లి అప్పుల్లో కొంత తీర్చి శభాష్ అనిపించుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం అనసూర్యను పాఠశాలలో ఉపాధ్యాయులు రమేష్, సరిత శాలువాతో ఘనంగా సత్కరించారు.

చదువుకొంటేనే తెల్లమొఖం



చదువుకొంటేనే నలుగురిలో తెల్లమొఖం ఉంటది. అందుకే పిల్లలందరినీ చదివించిన. ఎంత కష్టమెచ్చిన నాలుగుగోడల మధ్యనే ఏడ్చిన. నా బాధ చెప్పుకోవడానికి నాకు పెద్ద దిక్కు ఎవరు లేకుండే. ఇంటి దగ్గర కృష్ణుని గుడికిపోయి ఆయన ముందర కూర్చొని నా బాధను చెప్పుకొనేదాన్ని. తట్టుకోలేని బాధ వచ్చి సచ్చిపోవాలనిపించినా నా పిల్లల మొఖం చూసుకొని బతికిన. అవమానాలన్నీ ఎదుర్కొన్నా. ఏ ఆడదైనా కష్టం వస్తే భయపడద్దు. ధైర్యంగా బతుకాలి. పిల్లలకు ఏమివ్వకున్నా చదివించాలి. – కొంకటి అనసూర్య

భద్రత.. బాధ్యత..

- షీ టీమ్, సఖి కేంద్రాల అభయహస్తం

మంచిర్యాలక్రైం: మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా జిల్లాలో షీటీమ్, సఖి కేంద్రాలు పని చేస్తున్నాయి. పని ప్రదేశాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ స్థలాలు, ప్రయాణాల్లో ఎవరైన వేధించినా, ఇబ్బందులకు గురి చేయడం, మాయమాటలతో మోసం చేసిన ఘటనలు చోటు చేసుకున్న వెంటనే డయల్ 100కు సమాచారం అందిస్తే తక్షణమే భద్రత కల్పిస్తున్నాయి. సమస్య ఉన్న చోటుకే వెళ్లి అక్కడే పరిష్కారం చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా షీ టీమ్, సఖీ కేంద్రాల సేవలపై ప్రత్యేక కథనం.



కౌన్సెలింగ్ ఇస్తున్న నిర్వాహకురాలు శ్రీలత

మహిళలకు అండగా ఉంటాం..

మహిళలు ఎలాంటి సమస్యల్లో ఉన్నా నిర్భయంగా ఫిర్యాదు చేస్తే అండగా ఉంటాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. న్యాయపరమైన సేవలు, వైద్య సేవలు అందిస్తాం. భార్యాభర్తలు, అత్తామామల వేధింపులకు గురైన వారికి అండగా నిలబడతాం. పోలీసుల సహకారంతో మహిళలకు భద్రత, రక్షణ కల్పిస్తాం.
– శ్రీలత, సఖీ సెంటర్ నిర్వాహకురాలు

షీ టీమ్ ఆపరేషన్ డెకాయ్...

మహిళల రక్షణ కోసం పోలీసు శాఖలో 2015అక్టోబర్ 31న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో షీ టీమ్స్ ఏర్పడ్డాయి. ఆపరేషన్ డెకాయ్ పేరుతో కళాశాలలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో షీ టీమ్స్ మఫ్టీలో ఉంటూ స్పై కెమెరాలతో ఘటనలను చిత్రీకరిస్తాయి. అనుమానితులను అదుపులోకి కౌన్సెలింగ్ ఇస్తారు. 2024లో ఎనిమిది రెడ్ హ్యాండెడ్ కేసుల్లో 21మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 10మంది మేజర్లపై కేసులు నమోదు చేశారు. వేధింపులపై 100 డయల్‌కు ఫిర్యాదు చేస్తే మఫ్టీలో నిఘా వేస్తారు. అనుమానితులు, పోకిరీలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇవ్వడం, కేసు నమోదు చేయడం చేస్తారు. జిల్లాలో 2024 నుంచి ఫిబ్రవరి వరకు 96 హాట్‌స్పాట్‌లను గుర్తించి 1424 సార్లు సందర్శించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

షాడోలా ఉంటూ రక్షణ కల్పిస్తాం..



షీ టీమ్‌కు ఫిర్యాదు చేస్తే షాడోలా ఉంటూ రక్షణ కల్పిస్తాం. సోషల్‌మీడియా, ఆన్‌లైన్ స్నేహితులను నమ్మవద్దు. వ్యక్తిగత సమాచారం, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దు. ఫొటోలు మార్ఫింగ్ చేసి సైబర్ నేరగాళ్లు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతారు. తెలియని నంబర్ల నుంచి వీడియో కాల్స్ వస్తే స్పందించవద్దు. సైబర్ నేరాలపై 1930, వేధింపులపై 100డయల్, 6303923700 షీ టీమ్ వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వచ్చు. టోల్ ఫ్రీ నంబర్లు 112, 181, 1090, 1091 ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. – హైమా, షీ టీమ్ ఎస్సై, మంచిర్యాల

అడవి దివిటీలు

- అడవి రక్షణలో మహిళా అటవీ ఉద్యోగుల కీలకపాత్ర
- పురుషులతో సమానంగా విధుల నిర్వహణ
- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



బ్లోయర్‌తో ఆకులను దూరం చేస్తున్న బీట్ అధికారి

జన్నారం: దట్టమైన అడవులు.. క్రూర జంతువుల అరుపులు.. కలప స్మగ్లర్లు.. వన్యప్రాణుల వేటగాళ్లు.. ఇవన్నీ చాలవన్నట్లు పోడు భూముల రక్షణ.. వీటన్నింటి మధ్య విధి నిర్వహణ కత్తిమీద సామే. అయినా అన్నీ దాటుకుంటూ అటవీ శాఖ మహిళా ఉద్యోగులు తామెంటో నిరూపించుకుంటున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ పురుషులతో సమానంగా ధైర్య సాహసాలతో విధులు నిర్వర్తిస్తూ అడవి దివిటీలుగా నిలుస్తున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని మంచిర్యాల జిల్లా అటవీశాఖ పరిధిలో 74మంది మహిళా ఉద్యోగులు వివిధ స్థాయిల్లో పని చేస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో ఎనిమిది మంది రేంజ్, డీఆర్వో, బీట్ అధికారులు ఉన్నారు.

24 గంటలు విధుల్లో..

అటవీ శాఖ ఉద్యోగం అంటేనే 24గంటల విధి నిర్వహణ. మహిళా ఉద్యోగులు రాత్రివేళల్లో పని చేస్తారా అనే సందేహాలను పటాపంచలు చేస్తూ తామేమి తక్కువ కాదని నిరూపిస్తున్నారు. జన్నారంఅటవీ రేంజ్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట అటవీ రేంజ్‌లలో మహిళా ఉద్యోగులు ఉదయమే అడవులకు వెళ్లి వన్యప్రాణుల కదలికలు, పులి పర్యవేక్షణ, స్మగ్లింగ్ తదితర అంశాలను పరిశీలిస్తారు. అధికారుల కళ్లుగప్పి కలప దాటిస్తున్న స్మగ్లర్ల ను పట్టుకోవడంలో ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు.

రాత్రిళ్లు పెట్రోలింగ్

మహిళా ఉద్యోగులు కలప స్మగ్లింగ్ నిరోధంలో భాగంగా ఒక్కోసారి వారి బీట్ పరిధిలో రాత్రివేళల్లోనూ ధైర్యంగా పెట్రోలింగ్ చేస్తుంటారు. చెక్‌పోస్టు డ్యూటీ, బీట్ పరిధిలో అభివృద్ధి పనులు, నీటి సౌకర్యం, గడ్డిక్షేత్రాల నిర్వహణ, పశువులు బీట్ పరిధిలో తిరగకుండా జాగ్రత్తలు తదితర పనుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

– రాత్రి ఒంటి గంట సమయంలో మీ బీట్ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగిందనే సమాచారం ఓ మహిళా ఉద్యోగికి అందింది. వెంటనే బేస్‌క్యాంప్, తోటి సిబ్బందికి సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యుల తోడుతో ఆ ప్రాంతానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చి ఇంటికి చేరుకున్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. సమాచారం అందగానే వెళ్లి మంటలు అడవంతా వ్యాపించకుండా బ్లోయర్ల సహాయంతో మంటలు వ్యాపించిన ప్రాంతంలో ఆకులను దూరం చేస్తారు.



పక్షులను కెమెరాలో బంధిస్తున్న రేంజ్ అధికారి

100 రకాల పక్షుల పేర్లు చెబుతాను



ఓ వైపు బీట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూనే బర్డ్‌వాక్‌లో పాల్గొంటాను. అధికారుల సహకారంతో డివిజన్ పరిధిలో సంచరించే 100 రకాల పక్షులను గుర్తించి వాటి పేర్లు చెప్పగలను. వీటితోపాటుగా సీతాకోకచిలుకల రకాలను కూడా చెబుతాను. ఉన్నత అధికారులు ఇచ్చిన శిక్షణతో ఇవన్నీ సాధ్యమైంది. మరో వైపు అటవీ రక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో తనవంతుగా కృషి చేస్తున్నాను. – లాల్‌బాయి, బీట్ అధికారి

వెనక్కి తగ్గేది లేదు..



నా పరిధిలో రెండు సెక్షన్లు ఉంటాయి. నా విధులను సక్రమంగా నిర్వర్తించకుండా వెనక్కి తగ్గేది లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అడవిలో వన్యప్రాణులకు నీటి సౌకర్యం, రాత్రి పెట్రోలింగ్, గడ్డి క్షేత్రాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సిబ్బందితో కలిసి పరిశీలిస్తాం. వన్యప్రాణుల సౌకర్యాల కోసం ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటాం. – సాగరిక, డిప్యూటీ రేంజ్ అధికారి

బర్డ్‌వాక్ విజయవంతం చేశాం



నా తోటి సిబ్బందితో కలిసి నాలుగుసార్లు నిర్వహించిన బర్డ్‌వాక్ విజయవంతం చేశాం. మహిళా సెక్షన్, బీట్ అధికారులు చాలా శ్రమించారు. రేంజ్ పరిధిలో స్మగ్లింగ్ జరుగకుండా రాత్రి, పగలు ప్రత్యేక నిఘా పెట్టాం. రాత్రివేళల్లో మహిళా ఉద్యోగులు వెనక్కి తగ్గకుండా పెట్రోలింగ్ చేస్తుంటాం. ఓ వైపు అడవిలో అభివృద్ధి పనులు, విధి నిర్వహణతోపాటు అడవిలోకి వెళ్లే సమయంలో కనిపించిన పక్షులను కెమెరాలో బంధిస్తుంటాను. సర్పెంట్ ఈగల్, వైట్ ఐ బ్లజర్ వంటి అరుదైన పక్షులను కెమెరాలో బంధించాను. – సుష్మారావు, తాళ్లపేట్ రేంజ్ అధికారి

క్లుప్తంగా

ఇన్‌స్పైర్‌కు 108 ప్రాజెక్టుల ఎంపిక

మంచిర్యాలఅర్బన్‌: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించే ఇన్‌స్పైర్‌ అవార్డు మనక్‌ కార్యక్రమానికి జిల్లా నుంచి 108 ప్రాజెక్టులు ఎంపికై నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను జిల్లా నుంచి 321 పాఠశాల నుంచి 1308 విద్యార్థుల ప్రాజెక్టు నామినేషన్లు నమోదు చేయగా 108 ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఎంపికై న విద్యార్థుల ఖాతాల్లో రూ.10వేల చొప్పున జమ అవుతాయని తెలిపారు. ప్రాజెక్టులను అద్భుత పనితీరుతో పనిచేసేలా రూపకల్పన చేయడానికి గైడ్‌ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఎంపికై న విద్యార్థులు వచ్చే విద్యాసంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్‌లో నిర్వహించే జిల్లా స్థాయి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

కీచక హెచ్‌ఎం సస్పెన్షన్‌

భీమిని: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన భీమిని మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంపై సస్పెన్షన్‌ వేటు పడింది. ఈ మేరకు డీఈవో గురువారం ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో కృష్ణమూర్తి తెలిపారు. పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థినిపై హెచ్‌ఎం రేగుచెట్ల రమేశ్‌ అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతనెల 28న అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే.

మక్కలను ఎత్తుకెళ్తుండగా ఇద్దరి పట్టివేత

వేమనపల్లి: మండలంలోని ఒడ్డుగూడం శివారులోని మత్తడి వాగు వద్ద నుంచి మక్కల ను ఎత్తుకెళ్తుండగా ఇద్దరిని గురువారం రాత్రి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి..జైపూర్‌ మండలం ఇందారం గ్రామానికి చెందిన రే గుంట వంశీ అతడితోపాటు మరో మహిళ మంతెన శ్యామల ఆటోలో ఒడ్డుగూడం శివా రులోని మత్తడి వాగు వద్దకు వచ్చింది. రాత్రిపూట కళ్లం వద్దకు వెళ్లి సంచుల్లో మక్కలను నింపి ఆటోలో తరలిస్తుండగా రైతులు గమనించి వారిని పట్టుకుని నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధిత రైతు వెంకటస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం పటేల్‌ తెలిపారు. ఆటోను సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. కాగా,ఆర్‌ఎంపీ వైద్యుడు అశోక్‌ నీల్వాయి వాగు సమీపంలో మొక్కజొన్న సాగు చేశాడు. కళ్లంలో నుంచి బస్తా మక్కలను దొంగలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడు.



నారీమణులు

అతివలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. పురుషులకు సమానంగా సత్తా చాటుతున్నారు. క్రీడా, విద్య, స్వయం ఉపాధి, తదితర రంగాల్లో ప్రతిభ కనబర్చి శెభాష్‌ అనిపించుకుంటున్నారు ఉమ్మడి జిల్లాలోని పలువురు నారీమణులు. కొందరు పలువురికి ఉపాధి చూపుతున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

ఒక్క బిడ్డ చాలనుకున్నం



తమ బిడ్డ శరదితన్వితో సుస్మిత, ప్రమోద్‌రావు దంపతులు

నిర్మల్‌: 'ఆడబిడ్డయితే ఏంటి.. తను వారసురాలే కదా. తనకు ఉత్తమ చదువును, ఉన్నత జీవితాన్ని ఇవ్వాలనుకున్నాం. అందుకే మాకు ఒక్కబిడ్డనే చాలనుకున్నాం..'అంటున్నారు నిర్మల్‌ జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌కు చెందిన తిరుపతి సుస్మిత, ప్రమోద్‌రావు దంపతులు. ఎవరెన్ని ఒత్తిళ్లు పెట్టినావారు అనుకున్నట్లుగానే ఒక్కబిడ్డకే జన్మనిచ్చారు. తన ఆకాంక్షలకు తగ్గట్లుగానే చదివించారు. తల్లిదండ్రుల ఆశయాలను ఆకళింపు చేసుకున్న ఆ బిడ్డ శరదితన్వి తనకంటూ గుర్తింపును తెచ్చుకుంటోంది. స్థానిక దీక్ష జూనియర్‌ కళాశాల కరస్పాండెంట్‌గా చేస్తున్న ప్రమోద్‌రావు ముందు నుంచి కొంత సామాజిక స్పృహతో ఆలోచిస్తుంటారు. శరదితన్వి ప్రస్తుతం ప్రముఖ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ ఆక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్‌ డెవలపర్‌గా చేస్తోంది. తండ్రిలాగే సామాజికస్పృహతో తన స్థాయిలో సేవలందిస్తోంది.

స్వ'శక్తి'తో ముందుకు..



ఆన్‌లైన్‌లో అప్లై చేస్తున్న కల్పన

ఆదిలాబాద్‌: ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న మహిళ ప్రైవేట్‌ ఉద్యోగానికి మొగ్గు చూపింది జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన ముదిగొండ కల్పన. ఇంటర్‌ తర్వాత వివాహం కాగా, అటు కుటుంబ బాధ్యతలు మోస్తూనే 2007లో డిగ్రీ పూర్తి చేసింది. భర్త ప్రోత్సాహంతో 2010లో జిరాక్స్‌, ఆన్‌లైన్‌ సెంటర్‌, బుక్‌స్టాల్‌ ప్రారంభించింది. టైలరింగ్‌ చేస్తోంది. ఇటీవల బ్యూటీషియన్‌ కోర్సులో శిక్షణ తీసుకుంటుంది. ఓ వైపు ఇంటిని చక్కదిద్దుతూనే బుక్‌సెంటర్‌ నడుపుతోంది. కుమారుడు, కుమార్తెలను చదివించి ప్రయోజకులుగా చేయాలనే తనవంతుగా శ్రమిస్తోంది.

ఆడబిడ్డపై ఆలోచన మారాలి

నిర్మల్‌:'ఆడబిడ్డయినా.. మగబిడ్డయినా ఒకటే. ఒకప్పుడు మగపిల్లాడుంటే చాలు అనుకునేది. కానీ.. ఈరోజుల్లో ఎవరైనా మంచి చదువు, ఉద్యోగం ఉంటేనే విలువ. పెద్దపెద్ద కార్పొరేట్‌ కంపెనీల నుంచి మొదలు పెళ్లి సంబంధాల దాకా ఆడ, మగ అనే తేడాలు చూడటం లేదు. వారి చదువు, హోదా, సంస్కారాన్ని గుర్తిస్తున్నారు. అందుకే మాకు ఒక్క ఆడబిడ్డనే అని ఏరోజూ ఆలోచించలేదు..'అని చెబుతున్నారు నిర్మల్‌కు చెందిన వైద్య దంపతులు చిటికెశి రంజిత, సంతోష్‌రాజ్‌. తమ బిడ్డ ఇషితారాజ్‌ ఎంత చదివితే అంత చదివిస్తామంటున్నారు. ప్రస్తుతం తాను ఎంబీబీఎస్‌ చదువుతోంది. అమ్మ గైనకాలజిస్ట్‌, నాన్న పీడియాట్రిక్‌ వైద్యుడు.వీరిద్దరూ బిడ్డకు గైడ్‌ చేస్తున్నామే తప్పా.. ఇది చదువు, అది చేయు అని చెప్పడం లేదంటున్నారు. అన్నిరంగాల్లో స్త్రీ, పురుషులు సమానంగా పనిచేస్తున్నారని, ఇకపై ఆడ,మగ అనే ఆలోచనను మానుకోవాల్సిందేనని అంటున్నారు.



తమ బిడ్డ ఇషితారాజ్‌తో వైద్యదంపతులు రంజిత, సంతోష్‌రాజ్‌

చిన్నచూపు పోవాలి



ఆసిఫాబాద్‌అర్బన్‌: మా స్వగ్రామం మంచిర్యాల. నాన్న ఓ సంస్థలో చిరుద్యోగి. ఇద్దరం ఆడపిల్లలం అయినా ఎవరిపైనా ఆధారపడొద్దని ఉన్నత చదువులు చదివించారు. నేను ప్రస్తుతం ఆసిఫాబాద్‌ అసిస్టెంట్‌ ట్రెజరీ ఆఫీసర్‌(ఏటీవో)గా పనిచేస్తుండగా, మా చెల్లెలు ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. నాకు ముగ్గురు, మా చెల్లికి ఇద్దరు ఆడపిల్లలే. వారిని అన్నిరంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతాం. చదువుతోనే భవిష్యత్తు బాగుంటుంది. ప్రతీ మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి. సమాజంలో మహిళలనే చిన్నచూపు పోవాలి.– భానుమతి గోమాస, అసిస్టెంట్‌ ట్రెజరీ ఆఫీసర్‌

ఇతరులపై ఆధారపడకుండా..



ఆసిఫాబాద్‌అర్బన్‌: ఇతరులపై ఆధారపడకుండా సొంతకాళ్లపై నిలబడాలని నిర్ణయించుకున్నా. ఇంటి వద్దే 20 ఏళ్ల క్రితమే టిఫిన్స్‌ సెంటర్‌ ప్రారంభించా. ప్రస్తుతం ఇంటి వద్ద 15 మంది ఉపాధి కల్పిస్తూ.. వ్యాపారం విజయవంతంగా కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరా క్యాంటీన్‌ను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రారంభించాం. అక్కడ కూడా మరో ఐదుగురు ఉపాధి పొందుతున్నారు. మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. ఆర్థిక స్వాతంత్య్రం సాధించాలి. – మార స్వరూప, మహిళా సమాఖ్య సంఘం సభ్యురాలు, ఆసిఫాబాద్‌

వైద్య వృత్తిని వదిలి.. ప్రజాసేవకు కదిలి



బోథ్‌: ఎంబీబీఎస్‌ పూర్తి చేసి.. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవకు కదిలారు బోథ్‌కు చెందిన డాక్టర్‌ సంధ్యారాణి. జెడ్పీటీసీగా గెలుపొంది మహిళా శక్తిని నిరూపించారు. బోథ్‌ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. జెడ్పీ సమావేశాల్లో తనగొంతు వినిపించారు. ఆమె వైద్యురాలు కావడంతో బోథ్‌ ఆసుపత్రిని అభివృద్ధి పర్చే ప్రయత్నం చేశారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి రూ.10 కోట్ల నిధులు తేవడంలో కృషిచేశారు. మాజీ జెడ్పీటీసీగా ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొంటోంది. – డా.సంధ్యారాణి, మాజీ జెడ్పీటీసీ, బోథ్‌

తేడా ఉండొద్దు



ఆసిఫాబాద్‌రూరల్‌: మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా సమాజంలో అందరం ఒక్కటే అనే భావన రావాలి. కొంత మంది తల్లిదండ్రులు కుమార్తె కంటే కుమారుడినే ఎక్కువ ఇష్టపడుతారు. అలా సంతానాన్ని సమానంగా చూడాలి. వారి నిర్ణయాలకు విలువ ఇవ్వాలి. – శ్రీదేవి, బీజెడ్‌సీ సెకండియర్‌, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆసిఫాబాద్‌

కఠిన చట్టాలు రావాలి



ఆసిఫాబాద్‌రూరల్‌: మహిళలకు కొన్నిచోట్ల రక్షణ లేకుండా పోయింది. యువతులు, మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయి. తప్పుచేసిన వారికి కఠిన శిక్షలు లేకపోవడంతో రెచ్చిపోతున్నారు. సమాజంలో మహిళల రక్షణకు కఠిన చట్టాలు రావాలి. – అశ్విని, ఎంపీసీఎస్‌ ఫైనలియర్‌, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆసిఫాబాద్‌

మహిళలకు అవకాశాలు పెరిగాయి



భైంసాటౌన్‌: నేటి కాలంలో మహిళలకు అవకాశాలు పెరిగాయి. ఏ రంగంలోనైనా వివక్ష ఉంటుంది. కానీ అవేమీ పట్టించుకోకుండా నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుంది. పెరుగుతున్న ఖర్చులకు ఇంట్లో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తేనే ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారు. రాజకీయాల్లో మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి. – సిరం సుష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షురాలు, భైంసా

అప్పుడు సర్పంచ్‌.. ఇప్పుడు టీచర్‌



పాఠం బోధిస్తున్న చెవ్వ సువర్ణ

చెన్నూర్‌రూరల్‌: గతంలో సర్పంచ్‌గా పని చేసింది. ఆ పదవీ కాలం పూర్తి కాగానే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుంది. మండలంలోని అంగ్రాజ్‌పల్లికి చెందిన చెవ్వ సువర్ణ. తాండూరు మండలం తంగళ్లపల్లికి చెందిన ఈమెకు చెన్నూర్‌ మండలం అంగ్రాజ్‌పల్లికి చెందిన చెవ్వ శ్రీనివాస్‌తో 2003లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. అప్పటికే బీఎస్సీ ఫస్టియర్‌ చదివింది. మూడేళ్లలో పూర్తి చేయాల్సిన డిగ్రీ.. పిల్లల ఆలపాలన చూసుకుంటూ ఐదేళ్లు పట్టింది. 2010లో ఎంఎస్సీ, 2012లో బీఈడీ పూర్తి చేసింది. 2013లో సర్పంచ్‌కు బీసీ మహిళా రిజర్వేషన్‌ రావడంతో గ్రామస్తుల కోరిక మేరకు స్వతంత్య్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందింది. ఐదేళ్లవరకు ప్రజలకు సేవలందించింది. 2019లో చెన్నూర్‌లోని సోషల్‌ వెల్ఫేర్‌ పాఠశాలలో గణిత టీచర్‌గా ఎంపికై విద్యార్థులకు పాఠాలు చెబుతోంది. భర్త ప్రోత్సాహంతో సాధ్యమైందని అంటోంది.

స్విట్జర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్‌ జాబ్‌



కోటపల్లి: మా స్వగ్రామం కోటపల్లి. మే ము నలుగురు అక్కాచెల్లెళ్లు. తల్లిదండ్రులు బాగా చదివించారు. అందరూ వివిధ రంగాల్లో స్థిరపడ్డాం. తాను స్విట్జర్లాండ్‌లో ఆరేళ్లుగా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్నా. ఏటా రెండు నెలలు అమ్మానాన్నలను స్విట్జర్లాండ్‌కు తీసుకెళ్తున్నా. – లక్ష్మీప్రసన్న

భర్త ప్రోత్సాహంతో



భీమారం: ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడాలనే లక్ష్యం పాఠశాల స్థాయిలో ఏర్పడింది. అందుకు బాగా చదివాను. పెళ్లయ్యాక చదువుకోవాలని భర్త ప్రోత్సాహించారు. టీచర్‌గా సేవ చేయాలనే కోరిక ఉన్నా భర్త తనను ఎస్సైగా చూడాలని ఉండేది. హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్‌ తీసుకున్నా. 2019 ఎస్సైగా ఎంపికయ్యాను. – కె శ్వేత,భీమారం ఎస్సై

రామగుండం సీపీగా అంబర్‌ కిషోర్‌ ఝా

- సీఐడీ విభాగానికి ఎం.శ్రీనివాస్‌ బదిలీ



బదిలీ అయిన శ్రీనివాస్‌



నూతనసీపీ అంబర్‌ కిషోర్‌ ఝా



డీసీపీగా ఎగ్గడి భాస్కర్‌

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనర్‌(సీపీ) ఎం.శ్రీనివాస్‌ సీఐడీ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వరంగల్‌ పోలీసు కమిషనర్‌ 2009బ్యాచ్‌కు చెందిన అంబర్‌ కిషోర్‌ ఝా నియామకం అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్‌ 2024 ఫిబ్రవరి 14న రామగుండం సీపీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి కమిషనరేట్‌ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్ర జిల్లాల పోలీసు అధికారులతో తరచూ సమావేశం అయ్యారు. మావోయిస్టుల కదలికలు కనిపెట్టేందుకు, సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడ పట్టేందుకు వీలుగా డ్రోన్‌ కెమెరాలు అందుబాటులోకి తెచ్చారు. మావోయిస్టుల గ్రామాల్లో సేవా కార్యక్రమాల్లో, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు చేరువయ్యారు. గంజాయి, పేకాట, రేషన్‌బియ్యం, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. రౌడీషీటర్లలో మార్పుకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఏఎస్పీగా..

రామగుండం సీపీగా నియామకం అయిన అంబర్‌ కిషోర్‌ ఝా ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఏఎస్పీగా పని చేశారు. ఆయనకు సౌమ్యుడి పేరుంది. ఐపీఎస్‌ తర్వాత మొదటి పోస్టింగ్‌ ఉమ్మడి జిల్లాలో ఏఎస్పీగా 2012లో కొంతకాలం పని చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలిసారిగా భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా పని చేశారు. 2018లో కేంద్ర సర్వీసుల్లో విధులు నిర్వర్తించారు. ఉమ్మడి జిల్లాలో ఏఎస్పీగా పని చేసిన ఆయనకు మంచిర్యాల జిల్లాపై కొంత అవగాహన ఉంది.

ఐపీఎస్‌ హోదాలో డీసీపీగా భాస్కర్‌

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్‌కు ఐపీఎస్‌ హోదాలో పోస్టింగ్‌ ఇస్తూ ఇక్కడే నియమిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. 2019 బ్యాచ్‌కు చెందిన ఆయన గ్రూప్‌–1 అధికారిగా పోలీస్‌ శాఖలో చేరారు. నాన్‌ క్యాడర్‌ డీసీపీగా 2024 జూన్‌ 20న మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు స్వీకరించారు. 2024 ఆగస్టు 14న స్టేట్‌ సర్వీస్‌ పూర్తి చేసుకోగా యూనియన్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఐపీఎస్‌ హోదా కల్పించింది. అనంతరం పోస్టింగ్‌ లేకపోవడంతో మంచిర్యాల డీసీపీగా అటాచ్డ్‌ చేశారు. ప్రస్తుతం ఐపీఎస్‌ హోదాలో డీసీపీగా బాధ్యతలు అప్పగించారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

కుభీర్‌: అక్రమంగా పశువులను బొలెరో వాహనంలో తరలిస్తుండగా కుభీర్‌ సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై పి.రవీందర్‌ తెలిపారు. మహారాష్ట్రలోని హిమాహిత్‌నగర్‌ నుంచి బొలెరో వాహనంలో 12 పశువులను నిజామాబాద్‌ జిల్లా షాటాపూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. షేక్‌ ఫయాజ్‌, షేక్‌ అమీన్‌, షేక్‌ యూసూఫ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న 'అంబేడ్కర్‌' నాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న అభ్యుదయ కళాకారులు

నెన్నెల: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ ఆశయాలు, లక్ష్యాలు అందరికీ తెలిసేలా స్ఫూర్తివంతంగా మండల కేంద్రంలో గురువారం రాత్రి నిర్వహించిన నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌, అంబేడ్కర్‌ సంఘం నాయకుల సౌజన్యంతో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ జీవితచరిత్రను సంఘం శరణం గచ్ఛామి పేరుతో ప్రదర్శించారు. అంబేడ్కర్‌ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, అంటరానితనం నిమ్నజాతుల హక్కుల కోసం చేసిన పోరాటాలు, రాజ్యాంగ రచన, రిజర్వేషన్లతోపాటు దేశ సేవలను ప్రదర్శించారు. ఇప్పటి వరకు అకాడమీ ద్వారా తెలంగాణలో 722 ప్రదర్శనలు ఇచ్చినట్లు అకాడమీ డైరెక్టర్‌ శివరప్రసాద్‌, రచయిత దేవరాజ్‌, సెక్రెటరీ జగ్గరాజు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌ సంఘం నాయకులు దుర్గం మల్లేశ్‌, గట్టు బానేశ్‌, సిద్ధార్థ, రాంమూర్తి, కృష్ణ, జాడి రాజ్‌కుమార్‌ పాల్గొన్నారు.

గోబర్‌గ్యాస్‌ గోదాంలో అగ్ని ప్రమాదం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ కాలనీలో గోబార్‌గ్యాస్‌ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. జిల్లా ఫైర్‌ అధికారి భగవన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఎస్‌కేజీఎస్‌ సంగ్‌ సంస్థ ఏసీసీ కాలనీలో ఒక క్వార్టర్‌ను అద్దెకు తీసుకుంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రైతులను ఎంపిక చేసి రూరల్‌ డెవలప్‌మెంట్‌ వర్క్‌ కింద ఉచితంగా (బయో) గోబార్‌ గ్యాస్‌ అందిస్తోంది. గ్యాస్‌ నిర్మాణంలో వాడేందుకు ఉపయోగించే ప్లాస్టిక్‌ పైపులు, కప్పులు గోదాంలో నిల్వ ఉంచారు. శుక్రవారం షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల విలువ చేసే ప్లాస్టిక్‌ కప్పులు, పైపులు దగ్ధమయ్యాయి. కాగా గోబర్‌ గ్యాస్‌ ఉచితంగా అందజేసేందుకు ఎలాంటి అనుమతులు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక ఫైర్‌ అధికారి రమేశ్‌బాబు, లీడింగ్‌ ఫైర్‌మెన్‌ అరుణ్‌కుమార్‌, డ్రైవర్‌ ఎంఎ రహీమ్‌, ఫైర్‌ మెన్‌ రాజేందర్‌, రమేశ్‌, శ్యాంసుందర్‌ ఉన్నారు.